# సతీ అనార్కలి

24-1-1942

ఆ రోజు వారి గాంధర్వ వివాహం జరిగింది.

"ప్రమోద్! మనంచేసేది తప్పే కదా!"

"కాదు కలీ! కాదు. మన ప్రేమ నిన్ననో, మొన్ననో అంకురించింది కాదు. చిన్ననాడే మనం పరస్పరం ఇష్టపడ్డాం. ఎన్నెన్ని కబుర్లాడుకున్నము. ఎన్నెన్ని ఊసులు చెప్పుకున్నాము? ఎన్నెన్ని ఆటలాడుకున్నాము? ఎన్నెన్ని ప్రేమలేఖలు ఇచ్చి పుచ్చుకున్నాము? ఈ రోజు దైవనిర్ణయం ప్రకారం, మనం భార్యా భర్తలమయ్యాము. దీంట్లో తప్పేముంది?'

"తప్పు లేదా! మనం చేసేది ముమ్మాటికీ తప్పే. మన ఆత్మ నిగ్రహం పోగొట్టుకోకుండా ఉండాల్సింది. మనిద్దరికీ పెళ్ళీడు కూడా రాలేదు. కనీసం రెండు మూడు సంవత్సరాలు దాటితేనే నీ కాళ్ళమీద నువ్వు నిలబడే తాహతు వస్తుంది. ఇక ముందెప్పుడూ, ఇలాంటి తప్పుడు పనిచేయకుండా ఉండాలి."

"నువ్వు చెప్పినది ముమ్మాటికీ సత్యం. ఇహ మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎవరికీ తెలియని సుదూర ప్రాంతాలకి మనం పారిపోవాలి. ఎందుకంటే మీ అమ్మ, అబ్బా, భాయీ లిద్దరి సహాయంతో మన నిఖా ఎప్పుడూ జరగదు."

"నీతో ప్రపంచంలోని ఏ మారుమూల ప్రాంతానికైనా రావడానికి నేను సిద్ధం. నీవు ఊఁఅంటే, చాలు."

"సరే, ఇప్పుడే బయల్దేరదాం నడు."

"నేను రెడీ. కానీ, ఎక్కడికి? నీ చేతిలో డబ్బెంత వుంది?"

"వచ్చిన చిక్కల్లా అదే కదా! త్వరలోనే ఆ సమస్యకూడా తీరిపోతుంది. కానీ, నిన్ను చూడకుండా ఒక్కరోజు కూడా నేనుండలేను."

"అది నావల్ల మాత్రం అవుతుందను కుంటున్నావా?"

ఒక గాఢపరిష్వంగ వివశత్వంలో మునిగి, తమని తాము మరిచిపోయి, వాళ్ళక్కడే కూర్చున్నారు. వాళ్ళిద్దరూ కళ్ళు మూసుకుని ఉన్నారని, చెప్పి, ఆ వైపు వచ్చిన వాళ్ళెవరయినా

కానీ, ఈ దృశ్యాన్ని చూడకుండా ఉంటారా! కాస్సేపటి తర్వాత, తిరిగి ఈ లోకంలోకి వచ్చిన వాళ్ళిద్దరూ, వేర్వేరు దారుల్లో గ్రామానికి బయలుదేరారు.

చార్మినార్ నుంచి దాదాపు పదిమైళ్ళు దక్షిణంగా ఉండే ఒక గ్రామానికి, దూరంలో ఉన్నపొదల ప్రదేశమే, ఈ సంఘటనా స్థలం. ఆ గ్రామంలో ఎనభైశాతం హిందువులు, ఒక మూలకి మిగతా ఇరవైశాతం ముస్లిములూ ఎంతో సఖ్యతతో ఉంటున్నారు. సాధారణంగా, ఆ గ్రామంలో హిందూ, ముస్లిం తగాదాలేమీ జరగవు. నిజాంపరిపాలన కదా!

ప్రమోద్ తండ్రికి హైదరాబాదులో ఒక చిన్న బట్టల దుకాణం ఉంది. ఆయనా, ఆయన భార్య చేసిన పూజలు, మొక్కినమొక్కుళ్ళ ఫలితమే వారి ఏకైక సంతానం ప్రమోద్. అమిత వాత్సల్యమనే పోషణనిచ్చి పెంచిన ఆ బాలుడు, ఎంతో పుష్టిగా పెరిగాడు కానీ, ఆరేళ్ళు నిండే వరకూ అతన్ని ఒకటో క్లాసులో చేర్పించలేదు. ఏ చిన్న జలుబు కానీ, జ్వరం కానీ, కడుపు నొప్పి కానీ, తలనొప్పికానీ వస్తేచాలు, రెండు మూడు రోజుల పాటు పాఠశాలకు వెళ్ళడమనే కఠిన శిక్ష నుంచి అతను విముక్తుడయ్యేవాడు. పెద్దవర్షం పడినదంటే ఇంటిగడప దాటడానికి వీల్లేదు. ఎండ కాస్త తీక్షణమైతే అబ్బాయి కందిపోతాడని, తల్లితండ్రుల భయం. ఏదేమయినా, స్కూల్లో అటెండెన్స్ శాతం తగ్గినా, పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినా, ఒక్క క్లాసులో కూడా అతను ఉత్తీర్ణుడు కాలేదనే అపఖ్యాతి పొందలేదు. మెట్రిక్కులేషన్ అనే ఆబ్స్టికల్ రేస్‌ని దాటడానికి అతనెంతో ఎక్కువ సమయం, ప్రయత్నం వెచ్చించవలసి వచ్చింది. దాని వల్ల అతనికి కలిగిన లాభమేమిటంటే, ఇంటర్మీడియెట్ క్లాసు గదిలోకి తొంగిచూసే అవసరం లేకపోయింది. మెట్రిక్యులేషన్ పాసయిన తరువాత, అతను తన తండ్రి బట్టలషాపులోనే, ఒక అప్రెంటీస్ మేనేజర్‌గా పనిచేయడం మొదలు పెట్టాడు. పగలంతా ప్రమోద్ తన దగ్గరే ఉండటం, ఆ తండ్రికి ఎంతో ప్రమోదం కలిగించేది. కొడుకు, తండ్రి అడుగుజాడలలో నడవడం, సర్వదా అతనికి సహాయంగా ఉండటం చూసి, ఆ తల్లి ఎంతో ఉప్పొంగి పోయేది. షాపు యజమాని పనిమీద ఊరికివెళితే, వ్యాపారంలో ఒక్కపైసా కూడా నష్టం రాకుండా ఆ పుత్రరత్నం చూసుకునేవాడు. షాపు మీద వచ్చే ఆదాయంతో, ఆ కుటుంబం దారిద్ర్యం అంటే ఏమిటో తెలియకుండా రోజులు గడపుతుండేది.

ఇరవైయేళ్ళ వయసున్న ప్రమోద్, రెండ్రోజులు గడ్డం గీసుకోకపోతే, చూసిన వాళ్ళెవరయినా, అతనికి ఇరవై అయిదేళ్ళు ఉంటాయని అనుకుంటారు. అయిదడుగుల పదంగుళాల ఎత్తు, దానికి తగిన లావు గల ఆ యువకుడి వదనం ఏ యువతినయినా సరే ఇట్టే ఆకర్షించేది. అంటే, మధ్య వయసు స్త్రీలకి ఆ ముఖం నచ్చదని కాదు, ఉద్దేశ్యం.

అనార్కలి కుటుంబసభ్యులు, ఆమె తల్లిదండ్రులు, ఇద్దరన్నలూ, కసాయి వృత్తి చేస్తున్న షౌకత్‌ఆలీ వయసు దాదాపు యాభైఅయిదు దాటింది. అతను మాంసం నరుకుతున్నప్పుడు, శరీరంపై చిందే నెత్తురు చుక్కలు, మాంసపు ముక్కల ప్రభావం వల్ల కాబోలు, ఉడుకుతున్న రక్తమూ, కండలు తిరిగిన శరీరము, ఈ వయసులో కూడా అతని స్వంతం. చాలా చిన్న వయస్సులో నిఖ్హా కావడం వల్ల అతనికి ఇరవయ్యారు, ఇరవై నాలుగేళ్ళ ఇద్దరు కొడుకులున్నారు. కుటుంబ నియంత్రణ, ఒక సంతృప్తి కుటుంబానికి ఆదారమని తెలుసుకున్న అతను ఇద్దరు కొడుకులు పుట్టడంతోటే సంతానపర్వానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని అనుకున్నాడు. కానీ, అతని బీబీకి ఒక కూతురు కూడా కావాలని చాలా మక్కువగా ఉండటం వల్ల కావచ్చు, ఏడు సంవత్సరాల అంతరాయం తర్వాత వాళ్ళకు బంగారం లాంటి ఒక పుత్రిక కలిగింది. తల్లిదండ్రులూ, ఆ ఇద్దరు అన్నలూ, కలిసి ఎంతో ఆలోచించి, ఆ అణిముత్యానికి, అనార్కలి అనే పేరు పెట్టడం జరిగింది. అల్లారుముద్దుగా ఆమె పెరిగింది. పెద్దవాడైన షబీర్ అహ్మద్‌ఖాన్, విద్యా విషయాలలో కాలం వృధాచేయకుండా, తండ్రిచేతిలోని పని చేతబుచ్చుకున్నాడు. రెండో వాడయిన షంషుద్దీన్‌ఖాన్ ఎనిమిదో తరగతితో చదువు ఆపేసి, ఒక ఫోర్డ్‌కానీ, ఇండియన్ టాటా కానీ కావాలని మోటార్ మెకానిజం నేర్చుకుంటున్నడు ఎంతో శ్రద్ధగా. షబ్బీర్ ఆ ఊరి రౌడీగా ఎదుగుతుంటే, షంషుద్దీన్ మాత్రం ఒక మర్యాదరాముడిగా రూపొందే ప్రయత్నంలో ఉన్నడు. ఆ అన్నదమ్ము లిద్దరి దేహదారుఢ్యం చూసి, ఆ ఊరి యువకులు, నవజాత కుసుమంలాంటి మనోహరియైన అనార్కలివైపు కన్నెత్తి చూడ్డానికి కూడా సాహసించేవారు కాదు.

15-11-1942

ప్రమోద్, అనార్కలి వారానికి ఒకసారో, రెండుసార్లో, ముందే నిర్ణయించుకున్న ప్రదేశంలో, నిర్ణీత సమయంలో కలుసుకునేవారు. ఒక్కోమారు వాళ్ళకి మాట్లాడుకోవడానికి అవకాశమే దొరికేది కాదు. అయినా కూడా, పరస్పరం చూసుకునే అదృష్టం లభించింది కదా అని వాళ్ళు తృప్తిపడేవాళ్ళు. ఒకవేళ తరువాత కలయిక గురించి నిర్ణయించుకోవడానికి వీలు కాకపోతే, ఆమె వెళ్ళేదారిలో అతను కాచుకుని ఉండి ఎవరూ చూడకుండా ఆమెకు సంకేతం అందించేవాడు.

ముందు అనుకున్న ప్రకారం, నవంబర్ అయిదవ తేదీన అతను, ఆమె కోసం ఎంతో సేపు ఎదురుచూశాడు. కానీ, ఆమె రాలేదు. ఆ తరువాత, మూడు నాలుగు రోజుల పాటు ఆమె దర్శనం కరువవ్వడంతో అతనికి పిచ్చెక్కినట్టయింది. రాత్రిళ్ళు అతనికి నిద్రపట్టడం లేదు. ఒంట్లో బాగా లేదని చెప్పి షాపుకి కూడా వెళ్ళకుండా, ఇంట్లోనే ఉండిపోయి దుర్భరమైన

రోజులు గడిపాడు. తల్లి, తన ముద్దుల కొడుకు పరిస్థితి చూసి ఎంతో ఆందోళన చెందింది. భర్తతో ఆమె మరీ మరీ ఈ విషయాన్ని చెప్పడం వల్ల అతను కొడుకుని ఒక డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళాడు. ప్రమోద్ ఆరోగ్యానికేమాత్రం ఢోకాలేదని డాక్టరు చెప్పడం, వాత్సల్యమూర్తులయిన ఆ తల్లిదండ్రులని సంతృప్తి పరచలేదు.

తొమ్మిదిరోజులు అనార్కలిని చూడకపోవడంతో, అతనికి ఊపిరాడలేదు. అతను ఎటువంటి దుస్సాహసానికైనా సిద్ధమయ్యాడు. అనార్కలి ఇల్లున్న వీధిలో అతను పిచ్చివాడిలా అటూ ఇటూ తిరిగాడు. చివరికి వాళ్ళ పక్కింటి అబ్బాయిని పిలిచి, కొంత దూరం తీసుకువెళ్ళి ఆమెగురించి అడిగాడు. అనార్కలి పదిరోజుల్నుంచి జ్వరంతో మంచం పట్టిందని ఆ అబ్బాయి చెప్పేసరికి, అతని మనసు కలత చెందింది. తన ప్రాణసఖిని చూడకుండా వుండడం తన వల్లకాదని, ఎలాగైనా ఆమెను చూసి తీరాలని అతను నిర్ణయించుకున్నాడు.

అనార్కలి తన ఇంటి గురించి, ఇంటిలోని గదుల గురించి అతనికి ముందెప్పుడో వివరించి, చెప్పడంతో పాటు ఆ పరిసరాల్లో అతను ఎప్పుడూ అడుగుపెట్టకూడదని ఒట్టు వేయించుకుంది.

ఆ పదిహేనో తేదీ సాయంత్రం, కొద్దిగా చీకటిపడిన తర్వాత నక్కుతూ, నక్కుతూ ఎవరికంటా కనబడకుండా, అతను అనార్కలి పడక గది బయటివైపున్న కిటికీ దగ్గరకు వచ్చాడు. మూసి ఉన్న కిటికీ తలుపులను తడతూ, "కలీ!కలీ!" అని భయంతో వణుకుతున్న పెదవులతో పిలిచాడు. లోపలినుంచి కదలిక ఉన్న జాడేమీ వినిపించలేదు. మెల్లగా కిటికీ తలుపులను లోపలికి నెడుతూ ఉంటే....

"దొంగ! దొంగ! అని పెద్దగా అరుస్తూ భూతం లాంటి ఒక ఆకారం ప్రమోద్‌ని వెనకనించి గట్టిగా పట్టుకుంది. అనుకోకుండా జరిగిన ఈ దాడివల్ల జడిసిపోయిన అతని ఫాంటు కొంతవరకూ భయజలంతో తడిసిపోయింది. ఆ భూతాకారం అతన్ని పైకెత్తుకుని, ఇంటి ముందువైపు వెలుతురు లోకి మోసుకెళ్ళిపోయింది. దొంగ, దొంగ అన్న అరుపులు విని పక్క ఇళ్ళవాళ్ళు కొందరు పోగయ్యారు. "నేను దొంగని కాను బాబోయ్!" అని ప్రమోద్ ఏడుస్తూ చెపుతున్నా వినిపించుకోకుండా అందరూ అతన్ని చితకబాదారు. ఆ దెబ్బలని తట్టుకోలేక, కుప్పకూలిపోయిన అతన్ని షబ్బీర్ అహ్మద్ హెచ్చరించాడు.... "ఒరేయ్ సువర్‌కా బచ్చా! నా అబ్బా ఇంట్లో లేకపోవడం వల్ల నవ్వు ఇవాల్టికి బతికిపోయావు. మళ్ళీ ఈ చుట్టుపక్కలేక్కడన్నా కనిపించావో నిన్ను ముక్కలు ముక్కలుగా నరికేస్తా...." ఈ దృశ్యాన్ని లోపలనించి చూస్తున్న అనార్కలికి నవనాడులూ కృంగిపోతున్నట్లుగా అనిపించింది. ఆరోజు

రాత్రి షౌకత్ అలీ ఇంటికి వచ్చిన తర్వాత, షబ్బీర్ అహ్మద్‌ఖాన్ జరిగినదంతా వివరించాడు. ఉగ్రకోపంతో అతని జీవన్‌టోన్ టైప్ మజిల్స్ కంపించిపోయాయి....వాటితో పాటు అతని కత్తిమీసాలు కూడా.

తరువాత, అతను అనార్కలి మంచం దగ్గరికి వెళ్ళి నిద్రపోతున్నట్టు నటిస్తున్న ఆమెని గర్జనతో జడిపించాడు "అనార్కలీ!"

పదిరోజులుగా, జ్వరంతో మంచంపట్టిన ఆమెకు భయంతో కంపించే ఓపిక కూడా లేదని తెలిసిన అతను ఎక్కువేమీ అడగలేదు. ఆ అబ్బాయితో పరిచయమేదయినా ఉందా అని అతనడిగినప్పుడు, స్కూల్లో చదువుకునే రోజుల్లో చూడటమే తప్ప ప్రత్యేకంగా పరిచయమేమీ లేదని ఆమె జవాబిచ్చింది.

మర్నాడు షబ్బీర్ అహ్మద్ ఖాన్ ఈ విషయం గురించి పదిమందితో వాకబు చేయగా, అనార్కలి రోజూ చదువుకోవడానికి వచ్చే పోయే దారిలో ఈ కుర్రవాడు కాపు వేసి ఉంటున్నాడని కొందరి ద్వారా తెలిసింది. దానితో అనార్కలి చదువు అటకెక్కింది. ఆమెకి ఇంట్లోంచి బయటికి అడుగుపెట్టే స్వాతంత్రం కూడా పోయింది.

ఒంటి నిండా గాయాలతో ప్రమోద్ ఇంటికి రావడం చూసి, తల్లి భయపడిపోయి, పూనకం వచ్చినదానిలా పెద్దగా అరుస్తూ ఏడ్చింది. ముళ్ళకంపలూ, రాళ్ళూ రప్పలు ఉన్న ఒక బావిలో చూసుకోకుండా కాలు జారిపడిపోయానని దానిలోంచి బయటకి రావడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చిందని అతను చెప్పినప్పుడు, అతని తల్లిదండ్రులకి, అదంత నమ్మశక్యంగా అనిపించక పోయినప్పటికీ, నమ్మినట్లు నటించక తప్పలేదు. ప్రమోద్‌కి పూర్తి ఆరోగ్యం తిరిగి రావడానికి దాదాపు ఒక నెల పట్టింది.

కొన్ని పోకిరీ కుక్కలకి తప్ప, ఊరిలోని మనుషులతో సహా సర్వజీవరాశులకు పోస్ట్‌మేన్ మల్లయ్య అంటే ఎంతో ప్రీతి. చాలా ఇళ్ళనుంచి అతనికి ఆహార, పానీయసత్కార్యాలు లభించేవి. కానీ, ఎంతో కాలం నుంచీ అతనితో పరిచయమున్నా, కొన్ని కుక్కలు మాత్రం ఎందుకతన్ని చూడగానే మొరిగి మొరిగి గొంతులు పాడుచేసుకుంటాయి? ఏదయినా, పూర్వజన్మ విరోధం ఉండి ఉంటుందా? ఊరందరికీ సందేశాలని అందించే, ఆ పోస్ట్‌మేన్, తమకి ఉత్తరాల్వికపోతే, పోనీ, కనీసం మనియార్డర్ అయినా ఇవ్వటంలేదని ఆ మొరటు కుక్కలకి కోపమేమో.

పోస్టుమేన్ మల్లయ్యకి ప్రమోద్ అంటే ఎంతో ఇష్టం. ప్రమోద్ ఆరోగ్యం బాగా

లేనప్పుడు, బావిలో పడి దెబ్బలు తగిలి నెల రోజులపాటు మంచం పట్టినప్పుడూ, ఆ మల్లయ్య మామ రోజూ ఒక అరగంట అతనితో గడిపేవాడు.

ప్రమోద్ కాస్త కోలుకుని, ఇల్లుదాటి బయటకు తిరగడం మొదలు పెట్టిన తరువాత, అతనికి తెలిసింది. అనార్కలి తన ఇంట్లోనే బందీగా పడుకుందని, ఆ విషయం గురించి తెలుసుకోవడానికి అతను ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టకుండా, పోస్ట్‌మేన్ మల్లయ్య ద్వారా అనార్కలికి ఒక ఉత్తరం వ్రాసిపంపించాడు. మల్లయ్యకి ఇటువంటి దౌత్యం నేరపడం ఎంతో భయంగా ఉండేది. కానీ, ఆ అబ్బాయి కన్నీరు చూసి, అతని మనసు కరిగి, ఆ దుస్సాహసానికి సిద్ధపడ్డాడు. మరుసటిరోజు, అతను దానికి జవాబు కూడా తెచ్చి ఇచ్చాడు. దానితో ఆమె తన సంకట పరిస్థితిని వివరిస్తూ, అతను ఇకముందు ఉత్తరాలు వ్రాయకుడదని, ఏదయినా ఉంటే, అది మల్లయ్య మామద్వారా చెప్పిపంపించాలని, నిర్దేశించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ, తన ఇంటి పరిసరాల్లో అతను అడుగు పెట్టకూడదని ఆమె ఆ ఉత్తరంలో అభ్యర్థించింది. ప్రమోద్ తన కాళ్ళమీద తాను నిలబడగలిగినప్పుడు, ఇక్కడికి దూరంగా ఏదయినా సురక్షిత ప్రదేశాన్ని అతను చూసి పెట్టినప్పుడు, ఆమె తన వాళ్ళని తన యింటిని వదిలేసి అతనితో రావడానికి సిద్ధమని ఆమె రాయడంతో, అతని మనసు ఆనందంతో పులకరించిపోయింది. అతని సంతోషం చూసి మల్లయ్య మామ కళ్ళల్లోనీళ్ళు తిరిగాయి. ఆమెని తప్పక చూసి తీరాలని ప్రమోద్ మల్లయ్య మామతో పదే పదే కబురంపినా, ఇప్పుడప్పుడే అది కుదరదనే స్థిరమైన జవాబు మాత్రమే ఆమె పంపేది. ప్రమోద్‌కి తనని చూడకుండా ఉండటం దుర్భరమవడంతో మార్నడు ఉదయం తన అబ్బా, భాయిలిద్దరు పనిలోకి వెళ్ళిన తరువాత, అమ్మీతో పక్కింటికీ వెళ్ళొస్తాననే వంకతో పదీపదిన్నర మధ్య ఒక అయిదు నిముషాలు గ్రామ పొలిమేరల దగ్గర కలుసుకుందామనే వర్తమానం ఆమె నుంచి మోసుకొచ్చాడు మల్లయ్యమామ.

13-1-1943

తెల్లారుజామునే లేచి, స్నానంచేసి, శుభ్రమైన బట్టలు ధరించి, గుడికివెళ్ళి, దేవుణ్ణి దర్శించుకుని, తొమ్మిదీ ముప్పావుకే అనార్కలి చెప్పిన స్థలంలో ఎదురుచూస్తూ నిలబడ్డాడు ప్రమోద్, ఒక్కొక్క క్షణం గడుస్తున్న కొద్దీ అతని గుండెదడ పెరుగుతూ వచ్చింది. పదిగంటలు దాటగానే, అసహనంతో అతనికి ఊపిరాగిపోయినట్టు అనిపించింది. అలా ఎదురుచూసి, ఎదురుచూసి...

పదింపావు అయ్యేసరికి....

దూరంగా, అనార్కలి నడిచివస్తున్నట్టు అతనికి కనిపించింది. కళ్ళు ఒకసారి నులుముకొని మళ్ళీ చూశాడు..

"అవునవును, నా అనార్కలి నా దగ్గరికే వస్తుంది."

ఒక్క ఉదుటున ఆమె దగ్గరికి చేరాలనిపించింది. కానీ అలా చేయడం తనకు మాత్రమే కాక, తన ప్రాణానికి ప్రాణమైన ఆమెకు కూడా ముప్పు తెస్తుందని అతను భయపడ్డాడు. బాక్సులో నిలబెట్టిన పందెపు గుర్రంలా అతని కాళ్ళు నేలమీద నిలవనంటున్నాయి. అనార్కలి మెల్లమెల్లగా దగ్గర దగ్గర కొస్తోంది. ఇక కొన్ని క్షణాల్లో అతను ఆమెను స్పృశించవచ్చు...

"అయ్యో! ఆమె ఒకసారి ఎడం ప్రక్కకి చూసి, ఏదో కౄరమృగం కనబడినట్టు వెనక్కి తిరిగి పరుగెత్తి వెళ్ళోందే....."

ప్రమోద్ కూడా ఆ వైపుకి చూశాడు. అక్కడ అతనికేమీ కనిపించలేదు. ఆమె దగ్గరికి వెళ్ళడానికి అతను వేగంగా నడిచాడు....పరిగెత్తుతున్నట్టు, ఆమె ఇంకా వేగంగా పరుగెత్తుతోంది. ఒక మలుపు దగ్గరికి వెళ్ళగానే, ఆమె వెనక్కి తిరిగి, "ప్రమోద్! నీ ప్రాణాలు రక్షించుకో, పారిపో" అంటూ అరిచింది. అతను వెనక్కి తిరిగి చూసినప్పుడు, పరిగెత్తుకొస్తున్న షబ్బీర్ అహ్మద్ కనబడ్డాడు. అది చూడటం తోనే ప్రమోద్ భూకంపంలో ఇరుక్కున్న శిలలా అయిపోయాడు. షబ్బీర్ షర్టుకాలర్ పట్టుకోగానే, ఆ శిల ఒక చింకిగుడ్డలా మారింది. షబ్బీర్‌ని చూసి ఒక్క తోపు తోసి పారిపోవడానికి ప్రయత్నించకుండా మాంత్రిక నిద్రలో లీనమైపోయినవాడిలా, షబ్బీర్ భజశక్తిని అతను యాంత్రికంగా గమనించాడు. అనార్కలి ఇంటికి చేరోలోగానే, షౌకత్ అలీ, షంషుద్దీన్, మరికొంతమంది, ప్రమోద్‌వైపు పరిగెత్తి వచ్చారు. షౌకత్ అలీ చేతిలో ఉన్న కసాయి కత్తిని షబ్బీర్ లాక్కున్నాడు.

"ఒరేయ్ సువర్‌కా బచ్చా! అమ్మాయిల వెంటబడతావా?" అంటూ ప్రమోద్ ఎడమతొడని నరికాడు. "అమ్మా!" అని అరుస్తూ అతను కిందపడ్డాడు. తరువాతి వేటు కుడితొడపై, రెండు కాళ్ళనుంచి స్రవిస్తున్న రక్తపు కాలువలు కలిసి ఒక రక్తపుటేరుగా మారింది. గిల గిలా కొట్టుకుని, అతని శరీరం అబోధావస్థకి చేరేముందు, అతని పెదవులు మంత్రించాయి, "అనార్కలీ!" అని, ఇంక షౌకత్ అలీ ఆగలేదు. కొడుకు చేతిలోంచి కత్తి తీసుకుని ఆ మృత ప్రాయుడి రెండు చేతులూ సరికేశాడు. ఒక దృఢనిర్ణయానికి వచ్చినట్టు అతను తన ఇంట్లోకి నడిచాడు. అనార్కలినని కూడా ఇలాగే నరికేస్తాడేమోనని భయపడి షంషుద్దీన్ అతని వెంటే వెళ్ళాడు. ఇంట్లోకి వెళ్ళిన షౌకత్ అలీ అనార్కలి కోసం చూడనే చూడలేదు. వెదికినా ఆమె దొరికేది కాదు. ఎందుకంటే ఆమె మరో ఇంట్లో దాక్కుని భయంతో గడగడా వణికిపోతోంది.

ఒక పెద్ద గోనెసంచీతో తిరిగివచ్చిన షౌకత్ అలీ, ప్రమోద్ నిశ్చల శరీరాన్ని దాంట్లో కుక్కేసాడు, తెగిపోయిన అతని రెండుచేతుల్ని కూడా నడవమని ఆజ్ఞాపించి, ఆ గోనెసంచి, తన భుజంమీద వేసుకుని నడిచాడు. ఎంతో విధేయతతో, షబ్బీర్ అతన్ని అనుసరించాడు.

పోలీస్ స్టేషన్‌కి చేరిన తరువాత షౌకత్‌అలీ, తనూ తన కొడుకూ కలిసి చేసిన నేరాన్ని పోలీసుల సమక్షంలో అంగీకరించాడు. భయమంటే ఏమిటో ఎరుగని ఆ పోలీసు వాళ్ళకు షౌకత్‌చేతిలో ఉన్న రక్తసిక్తమైన కత్తిని స్వాధీనం చేసుకున్నాకే మనసు కుదుటపడింది. చేతికి చక్కని నేరస్తులు ఎవ్వరూలేని ఒక రెడీమేడ్ కేసు కావడం వల్ల, ఏ మాత్రం కాలం వృధా కానీయకుండా ఒక హత్యకేసు రిజిస్టర్‌చేసి, తదనంతర కార్యక్రమాలు చేపట్టడానికి సబ్-ఇన్‌స్పెక్టర్ చురుకుగా ముందుకు కదిలాడు. ఇలా సత్వర చర్య తీసుకోకపోతే, ఆ నరహత్యకేసు మత కల్లోలానికి దారి తీయవచ్చని అతను భయపడ్డాడు. హత్యచేసిన తరువాత నేరస్తులు పారిపోకుండా తన సమక్షంలో లొంగిపోయినందుకు, అతను వారికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నడు. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్ళి, కొంత ఎక్కువ సంఖ్యలో ముస్లిం సాక్షులని, వారితో పాటు కొందరు ముస్లిం నేతలని తనతో పాటు స్టేషనుకు తీసుకు వచ్చాడు.

కొడుక్కేదో ప్రమాదం జరిగిందన్న వార్తవిన్న ప్రమోద్ తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కి పరుగున వాచ్చారు, కానీ, రక్తసిక్తమైన ఆ శరీరాన్ని చూసి తట్టుకోలేక పోయారు. రెండు చేతులు పోగొట్టుకుని పడున్న ఆ యువ శరీరాన్ని చూసి తల్లి స్పృహ కోల్పోయింది. శరీరమూ, మెదడూ రెండూ మొద్దుబారిపోయిన ఆ తండ్రికి ఆమెను డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళే బాధ్యత మాత్రం తప్పలేదు. ఈ లోపల ప్రమోద్ ఇరుగు పొరుగు వాళ్ళు, కొంతమంది డాక్టర్ ఇంటికి, మరికొంతమంది పోలీస్‌స్టేషన్‌కి రావడం వల్ల భార్యను చికిత్సకోసం డాక్టర్ ఇంటిలో వదిలేసి ప్రమోద్ తండ్రి తిరిగి పోలీస్ స్టేషన్‌కు చేరుకోగలిగాడు. కానీ, అతను స్టేషన్‌కి చేరేలోగా, పోలీసులు ప్రమోద్‌ని గవర్నమెంట్ హాస్పటల్‌కి తీసుకు వెళ్ళడం, అక్కడి డాక్టర్లు, ఎక్కువ రక్తం శరీరం నుంచి పోవడంతో, అతని ప్రాణం కూడా పోయినట్టు చెప్పడం జరిగింది.

14-1-1943

ప్రమోద్ హత్య జరిగిన మరుసటిరోజు మధ్యాహ్నం తరువాత అతని శరీరాన్ని పోస్ట్‌మార్టమ్ అయిన తరువాత, శవతుల్యుడైన అతని తండ్రికి పోలీసులు అప్పజెప్పారు. శవాన్ని గ్రామానికి తీసుకొచ్చేటప్పుడు, కొంతమంది పోలీసులు కూడా వెంట వచ్చారు. ప్రమోద్ తల్లి మామూలుగా స్పృహ కోల్పోలేదని, మెదడులో రక్తస్రావం జరిగి “కోమా”లోకి

వెళ్ళిపోయిందని, ఆ స్థితి నుంచి బయటికి రావడానికి ఎన్ని రోజులుపడుతుందో తెలయదని, ఆమెను గవర్నమెంటు హాస్పటల్‌లో చేర్పించినప్పుడు అక్కడి డాక్టర్లు అభిప్రాయపడ్డారు. ఈ సంఘటనతో గ్రామంలోని హిందువులు కోపోద్రిక్తులయ్యారని తెలుసుకున్న పోలీసు అధికారులు కొంతమంది ఆ గ్రామానికి వచ్చారు. వాళ్ళ ఉపదేశాల ప్రకారం, సూర్యాస్తమయం లోపుగా దహనకాండ నిర్వహిస్తానని, ప్రమోద్ తండ్రి ఒప్పుకున్నాడు. ఆ చితి జ్వాలలు చల్లారిన తర్వాతే, ఆ గ్రామ హిందువుల కోపావేశజ్వాలలు అణగారిపోతాయని, ఆ పోలీసు అధికారులకు బాగా తెలుసు.

సాయంత్రం అయిదు గంటలకి దౌర్భాగ్యుడైన ఆ తండ్రి ప్రమోద్ చితికి నిప్పంటించాడు. నాలుగైదు నిముషాల్లో అది నింగికెగసేలా మండింది. నాలుగు పక్కలా ఉన్న వందలాదిమంది ఈ దృశ్యాన్ని చూసి కన్నీరు కార్చారు. వాళ్ళలో కొంతమంది భోరున ఏడ్చారు. ఇంకొంతమంది ముస్లిములకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈతరుణంలో....

ఆ గుంపును చీల్చుకుని ఒక సుడిగాలి, ఆచితి దగ్గరికి దూసుకొచ్చింది. ఒక్క ఉదుటున ఆ చితి గుండెల్లోకి దూకింది. దానితో ఆ అగ్ని జ్వాలలు మరింత ఉత్సాహంతో నృత్యంచేసాయి. రెండు సంగమిత ఆత్మల పరమానంద శిఖరానికి తేజోచిహ్నమేనా ఆది!

ఆ సుడిగాలిని ఎవ్వరూ ఆపలేకపోయారు. ఇదంతా కళ్ళుమూసి తెరిచేలోగానే జరిగిపోయింది. అక్కడున్న పోలీసులు నోరు తెరుచుకుని చూడటం తప్ప మరేమీ చేయలేకపోయారు. శిలలుగా మారిపోయిన ఆ జనంలో కొంతమంది యువకుల పెదవుల నుంచి, "అనార్కలి! అనార్కలి!" అనే మాటలు మెల్లగా వినిపించాయి. మరి కొన్ని క్షణాలలో అందరి అధరాలపైకి ఆపేరు వ్యాపించింది.

అందరికీ ఒక విషయం అర్థమైంది....అనార్కలి తన బట్టల మీద కిరసనాయిలు చల్లుకుని వచ్చిందని, కాకపోతే, అంత తక్కువ వ్యవధిలో ఆ జ్వాల రెండింతలయ్యేది కాదు. ఆమె తోసుకొచ్చిన వాళ్ళ బట్టలకి కూడా, ఆ శిలాజతైలం గంధం విస్తరించింది. అనార్కలి ఆత్మ త్యాగం కళ్ళారా చూసిన ఆ కుపిత హిందువుల నినాదాలు వాటంతటవే నెమ్మదిగా అగిపోయాయి. ఇంకో ప్రాణం కూడా నష్టపోయింది కానీ, దానివల్ల మతకల్లోలాలు చెలరేగే ప్రమాదం తప్పిపోయిందని, అక్కడున్న పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఒక విధంగా, ప్రమెద్ తల్లి అదృష్టవంతురాలనే చెప్పాలి, ఎందుకంటే ప్రమెద్, అతని ప్రియురాలు చనిపోయినట్టు ఆమెకి తెలియదు. కోమాలోకి వెళ్ళిన ఏడవ రోజునే ఆమె అంతిమ శ్వాస విడిచింది.

ప్రమెద్ తండ్రి...ఆశలు, అవసరాలు, అనుభూతులు, ఉద్దేశ్యాలు...ఏవీ లేని ఒక జీవచ్ఛవంలా శేషజీవితం వెళ్ళబుచ్చాడు. అతనికి సహాయ సానుభూతులందించటానికి వితంతువూ, సంతాన రహిత అయిన అతని చెల్లెలు రావడం ఎంత ఊరట కల్గిస్తుంది?....అతనికా?మనకా?

ఆ రెండు దుర్మరణాలు ఎవరి జీవితాన్ని ......ఎవరి మనసుని ఎక్కువగా బాధించాయి?

ప్రమోద్, అనార్కలి మధ్య ప్రేమ పెరగడానికి తను తోడ్పడటం వల్లనే, వాళ్ళదయనీయ మరణాలు సంభవించాయని పూర్తిగా విశ్వసించిన పోస్ట్‌మేన్ మల్లయ్య ఒక పిచ్చివాడిలా మారాడు. ఎక్కువ సమయం వాళ్ళ సమాధుల దగ్గరే గడిపేవాడు. తన చేతులతో అతను అక్కడ ఒక చిన్న గుడి కూడా నిర్మించాడు. దానికి అతను పెట్టిన పేరు "సతీ అనార్కలి మందిరం".